Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
15-09-2025
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 282 | పేజీలు-04 | వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD | సోమవారం | WWW.EPAPER.MAHAADAILY.COM



## భారత్ ఘనవిజయం

### దుబాయ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ చిత్తు

భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేసిన పాక్

సింపుల్ గా విజయతీరాలకు చేర్చిన సూర్య, తిలక్

వివరాలు 8లో

టూకీ న్యూస్

**నేను శివభక్తుణ్ని**

- ఆ విషాన్ని నేను హరించేస్తా
- అసోంలో ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు



03

26 మంది ప్రాణాల కంటే **డబ్బే ముఖ్యమా?**

- ఎంఐఎం అధినేత ఓవైసీ ఫైర్



03

**మిరాయ్.. రయ్.. రయ్**

- ఇండస్ట్రీ రికార్డు
- 2 రోజుల్లో రూ.55 కోట్లు



03






03

## బైక్ పై సీతక్క పర్యటన

ముందు ములుగు ఎస్పీ శబరిష్.. వెనుక మంత్రి సీతక్క

హోదాను పక్కనపెట్టి బైక్ పై కలియ తిరిగిన మంత్రి

మేడారం జాతర రహదారులను పరిశీలించి పలు సూచనలు చేసిన మంత్రి

# నిరసనలతో దద్దరిల్లిన లండన్

### లక్ష మందితో యాంటీ ఇమిగ్రేషన్ ర్యాలీ

బ్రిటన్‌లో వలసదారులకు కష్టాలు



**లండన్:** యూకే రాజధాని లండన్ నగరం వలస వ్యతిరేక నిరసనలతో హోరెత్తిపోయింది. యాంటీ ఇస్లాం, యాంటీఇమిగ్రేషన్ కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో జరిగిన 'యూనైట్ ద కింగ్‌డమ్' ర్యాలీలో దాదాపు 1.10 లక్షల మంది పాల్గొన్నారని మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించారు. యూకేలో ఇటీవల కాలంలో అతిపెద్ద ప్రదర్శనల్లో ఇది ఒకటిగా పేర్కొన్నారు. ఈ ప్రదర్శన సమయంలో పోలీసులు, నిరసనకారుల మధ్య ఉద్రిక్తవాతావరణం నెలకొంది. యాంటీ ఇమ్మిగ్రేషన్ పై గళమెత్తారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్లకార్డులను ప్రదర్శించారు. వెస్ట్‌మిన్‌స్టర్ బ్రిడ్జి హౌస్ ఆఫ్ పార్లమెంట్ వద్ద జరిగిన యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీలో పాల్గొన్నారు. యూనియన్ జాక్, సెయింట్ జార్జ్ ఇంగ్లాండ్ జెండాలను ప్రదర్శించారు. పలుచోట్ల దాడులు సైతం చోటు చేసుకున్నాయి. ఆందోళనకారులు పోలీసులతో ఘర్షణ పడ్డారు. పోలీసులపై పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. వారిపై బాటిళ్లను విసిరికొట్టారు. చేతికి అందిన వస్తువులతో దాడికి దిగారు. ఈ ఘటనల్లో పలువురు పోలీసులు గాయపడ్డారు. ఆందోళనకారులకు గాయాలయ్యాయి. వారిని వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనల్లో 26మంది అధికారులు గాయపడ్డారని, వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. 25 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అల్లర్లలో పాల్గొన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ మాట్ ట్విస్ట్ తెలిపారు. మిగతా 3లో

## జూబ్లీహిల్స్‌లో గెలుపు మనదే

### ఈ ఎన్నికను ప్రతి ఒక్కరూ ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి

అభ్యర్థి సంగతి ఏఐసీసీ చూసుకుంటుంది

జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హాజరైన మహేష్‌గౌడ్, మంత్రులు, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్‌లు



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నిక అంశానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష చేపట్టారు. దీనికి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, జూబ్లీహిల్స్ ఇంచార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లతో పాటు డివిజన్ ఇన్ ఛార్జిలు, సర్వే ఏజెన్సీల నుంచి పలువురు హాజరయ్యారు. మిగతా 3లో



# ఐదేళ్లుగా విమోచన

## దినోత్సవాన్ని కేంద్రమే నిర్వహిస్తోంది

- యువతలో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం: కిషన్ రెడ్డి
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవ వేడుకలు
- ప్రత్యేక ఫొటో ప్రదర్శనను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడానికి దారితీసిన చారిత్రక పోరాట ఘట్టాలను, నాటి ప్రజల త్యాగాలను కళ్లకు కట్టేలా ఈ ఫొటో ప్రదర్శనను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వమే హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఆనాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. "నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, వారి ధైర్యసాహసాలు, విమోచన పోరాటాల వెనుక ఉన్న చారిత్రక సత్యాలను నేటి యువతరానికి తెలియజేయాలన్నదే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశం" అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రదర్శన ద్వారా నాటి ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 17న కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాన ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు. ఆయనతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, మహారాష్ట్రకు చెందిన మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. రామచందర్ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితర నేతలు పరిశీలించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదర్శనను తిలకించి, పోరాట యోధుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల ద్వారా హైదరాబాద్ విమోచన చరిత్రను ప్రజల ముందుంచి, యువతలో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యమని నేతలు పేర్కొన్నారు.

# రాష్ట్రాన్ని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం

## అద్భుతమైన ప్రదేశాలు తెలంగాణలోనూ ఉన్నాయి
## పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, మహా:** తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని అక్షయ కన్వెన్షన్‌లో జరిగిన నాలుగవ సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ), పర్యాటక శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతదేశం వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని, ఈ రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషించనుందని అన్నారు. పురాతన కోటలు, రాజ మహల్స్, దట్టమైన అడవులు, నదులు, సరస్సులు, కొండలు, ఆధునిక విలాసవంతమైన హోటళ్లు వంటి అద్భుతమైన ప్రదేశాలు తెలంగాణలో ఉన్నాయని, ఇవి రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురాగలవని చెప్పారు.

ఆకర్షించడానికి కొత్త విధానాలను రూపొందిస్తున్నాం.. వెడ్డింగ్ ప్లానర్లు ఈ ప్రాంతాన్ని కేవలం ఒక రాష్ట్రంగా కాకుండా, ఒక జీవన సంస్కృతిగా చూసి అంతర్జాతీయంగా ప్రచారం చేయాలని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. పెళ్లి కేవలం రెండు మనసుల కలయిక మాత్రమే కాదని, రెండు కుటుంబాలు, సంస్కృతుల సమ్మేళనమని అన్నారు. ఈ అపూర్వమైన క్షణాలను పదిలపరుచుకోవడానికి తెలంగాణలోని అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు అనువైనవని తెలిపారు. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అత్యుత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్‌లను ప్లానర్లకు పరిచయం చేయడానికి ప్రత్యేక ఫ్యామిలియరైజేషన్ (ఎఫ్ఏఎమ్) టూర్లు నిర్వహిస్తామని, అనుమతులు, లైసెన్సులు, లాజిస్టిక్స్ వంటి ప్రక్రియలను వేగవంతం చేస్తామని చెప్పారు. పబ్లిక్‌ప్రైవేటు భాగస్వామ్యంతో పెట్టుబడులను ఆకర్షించడానికి కొత్త విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. "మీరు ఆలోచించండి, మేము అమలు చేస్తాం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు.



## అలయ్ బలయ్‌కి రండి
### సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందించిన దత్తన్న

**హైదరాబాద్, మహా :** అక్టోబర్ 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరిగే "అలయ్ - బలయ్" కార్యక్రమానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. జూబ్లిహిల్స్ లోని రేవంత్ రెడ్డి నివాసంలో ఆదివారం కలిసిన దత్తాత్రేయ ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందించారు. ప్రతి సంవత్సరం దసరా తర్వాత దత్తన్న అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# యుద్ధాలపై మాకు మోజు లేదు..

## ట్రంప్ 100 శాతం టారిఫ్‌ల బెదిరింపులపై చైనా కౌంటర్



**బీజింగ్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల బెదిరింపులపై తీవ్రంగా స్పందించింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తోన్న చైనాపై నాటో దేశాలు 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలన్న అమెరికా అధ్యక్షుడి ప్రతిపాదనలను తిప్పికొట్టింది. యుద్ధాలు సమస్యలను పరిష్కరించలేవని, ఆంక్షలు మరింత సంక్లిష్టం చేస్తాయని చైనా విదేశాంగ మంత్రి వాగ్ యీ స్పష్టం చేశారు. స్లొవేనియా విదేశాంగ మంత్రి టాంజా ఫజోన్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూపై వ్యాఖ్యలు చేశారు. 'చైనా యుద్ధాల్లో పాల్గొనదు.. అటువంటి ప్రణాళికల్లో భాగస్వామ్యం కాదు.. మేము చేసే పని శాంతి చర్చలు ప్రోత్సహించడం, సంభాషణలు ద్వారా వివాదాస్పద సమస్యలకు రాజకీయ పరిష్కారం తీసుకురావడమే' అని వాంగ్ యీ ఉద్ఘాటించారు. అంతేకాదు, బహుళపక్ష వ్యవస్థలను బలోపేతం చేయాలని, ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఉద్దేశాలు, సూత్రాలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతకాలంలో అంతర్జాతీయ పరిస్థితులు కల్లోలం, నిరంతర ఘర్షణలతో ముడిపడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# 200 రోజులైనా ప్రభుత్వాలు స్పందించట్లేదు..

## రేవంత్ సర్కారు నేరపూరిత నిర్లక్ష్యం వల్లే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం

### బీజేపీ బడే భాయ్ ఎందుకు కాంగ్రెస్ చోటే భాయ్‌ని కాపాడుతున్నారు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కూలిన ఘటన జరిగి 200 రోజులు దాటినా ఆరుగురు కార్మికుల మృతదేహాలను వెలికితీయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ సర్కారు నేరపూరిత నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఆయన ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. 'అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం 200 రోజులు గడిచినా ఆరుగురు బాధితుల మృతదేహాలను కూడా వెలికితీయలేకపోయింది. వారి కుటుంబాలకు ఇంతవరకు ఎలాంటి నష్టపరిహారం అందించలేదు" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపైనా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న సమస్యలకే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపి హడావుడి చేసిన బీజేపీ.. ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఎందుకు స్పందించడం లేదు.

### ప్రతిదానికీ సమాధానాలు రాబడతాం..

ఎందుకు ఎలాంటి దర్యాప్తు బృందాన్ని పంపలేదు? తెలంగాణలో కాంగ్రెస్ (ఛోటే భాయ్)ను బీజేపీ (బడే భాయ్) ఎందుకు కాపాడుతోంది? వీరి మధ్య ఉన్న ఈ అపవిత్ర బంధం ఏమిటి?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితులకు న్యాయం చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. "మేం అధికారంలోకి వచ్చిన రోజున ఆ ఆరు కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం. ఆరుగురు కార్మికులను సజీవ సమాధి చేసిన వారు తగిన మూల్యం చెల్లించుకునేలా చేస్తాం. కాంగ్రెస్ నాశనం చేసిన ప్రతిదానికీ సమాధానాలు రాబడతాం" అని స్పష్టం చేశారు.

# యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రైలు

## ప్రాజెక్టును పట్టాలెక్కించిన రైల్వే శాఖ.. 2028 నాటికి పూర్తి కానున్న ప్రాజెక్టు

**హైదరాబాద్, మహా :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ కీలక అడుగు వేసింది. హైదరాబాద్‌టు యాదాద్రికి ఎంఎంటీఎస్ ఫేజ్ 2 విస్తరణ ప్రాజెక్టును పట్టాలు ఎక్కించింది. సుమారు రూ.412 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదట హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు అనుకున్న ఈ ప్రాజెక్టును ఇప్పుడు వంగపల్లి వరకు పొడిగించారు. దీంతో ఈ మార్గం పొడవు 35 కిలోమీటర్ల నుంచి 41 కిలోమీటర్లకు పెరిగింది. ఈ ప్రాజెక్టు కింద సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, సివిల్ పనులను కాంట్రాక్టులకు అప్పగించారు. ఈ పనులను రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ వీఎన్ఎల్) సంస్థ పర్యవేక్షిస్తుంది. 201617లో ఈ ప్రాజెక్టుకు రూ.330 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు లభించింది. అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు వ్యయంలో మూడింట రెండు వంతులు భరిస్తామని చెప్పినా, నిధులు విడుదల చేయడంలో జాప్యం జరిగింది. అయితే, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం మొత్తం వ్యయాన్ని తానే భరిస్తుందని ప్రకటించింది. జాప్యం కారణంగా ఇప్పుడు వ్యయం రూ.412.26 కోట్లకు పెరిగింది.

ఈ ప్రాజెక్టు కింద కొత్తగా ఎంఎంటీఎస్ స్టేషన్లను ఘట్‌కేసర్, బీబీనగర్, పగిడిపల్లి క్యాబిన్, భువనగిరి, యాదాద్రి (రాయగిరి), వంగపల్లిల్లో ఏర్పాటు చేస్తారు. మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో 18.62 హెక్టార్ల ప్రైవేటు భూమిని సేకరించాల్సి ఉంది. భూసేకరణ ప్రక్రియ కూడా తాజాగా మొదలైంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో వంగపల్లి యాదాద్రి (రాయగిరి) భువనగిరి పగిడిపల్లి మార్గాన్ని 202627 నాటికి పూర్తి చేయాలని యోచిస్తున్నారు. రెండో దశలో పగిడిపల్లి బీబీనగర్ ఘట్‌కేసర్ మార్గాన్ని 202728 నాటికి పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులకు ప్రయాణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. హైదరాబాద్ నగరం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రూ.20 టికెట్‌తో గంటలోపే చేరుకోవచ్చని అధికారులు తెలిపారు.

# జూబ్లీహిల్స్‌కు ప్రథమ ప్రాధాన్యత

## సమస్యలు లిఖిత పూర్వకంగా కాగితంలో రాసివ్వండి

- వారం రోజుల్లో ఆ సమస్యలు పరిష్కారం చేస్తాం: మంత్రి పొన్నం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే కాదు.. రాజధాని బ్రాండ్ ఇమేజ్ కాపాడుతాం
- ముఖాముఖి కార్యక్రమంలో పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే కాదు.. హైదరాబాద్ రాష్ట్ర రాజధాని బ్రాండ్ ఇమేజ్ కాపాడే విధంగా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రక్రియ మొదలుపెట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సోమాజిగూడ డివిజన్‌లో జయ ప్రకాష్ కాలని, ఇంజనీర్స్ కాలనీ ప్రజలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావులు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సమస్యల పరిష్కారంలో జూబ్లీహిల్స్‌కి ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. అన్ని ఏరియాల్లో సమస్యలను లిఖిత పూర్వకంగా కాగితంలో రాసివ్వండి.. వారం రోజుల్లో ఆ సమస్యలు పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చారు. 1923 లో నిజాం కాలంలో హిమాయత్ సాగర్ , నిజాంసాగర్, తర్వాత సింగూరు , మంజీరా జలాలు కృష్ణ ఫేజ్ 1,2,3 ,గోదావరి ఫేజ్ 1 కి హైదరాబాద్‌కు తాగునీరు తీసుకొచ్చామన్నారు. ఇప్పటి వరకూ నగరానికి 630 ఎంఎల్‌డీ నీళ్లు వస్తున్నాయని తెలిపారు. గత పది సంవత్సరాలుగా హైదరాబాద్ నగరం చాలా పెరిగింది.. అవసరానికి తగిన విధంగా నగరానికి నీళ్లు తీసుకువచ్చే కార్యక్రమాలు ఏమి చేయలేదన్నారు. కాలనీలో ఇబ్బందులు లేకుండా అభద్రత భావం లేకుండా నైట్ పెట్రోలింగ్ అడుగుతున్నారు.. వెంటనే పోలీసులు నైట్ పెట్రోలింగ్ పెంచాలని ఆదేశించారు. ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి బలోపేతం చేయాలని మంత్రి కోరారు.

# ప్రాంతీయ భాషలకు హిందీ పోటీ కాదు.. స్నేహితురాలు మాత్రమే

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**అహ్మదాబాద్, మహా :** హిందీని కేవలం సంభాషణలకు, అధికారిక కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేయకూడదని, సైన్స్, టెక్నాలజీ, న్యాయం, పోలీసు యంత్రాంగం వంటి కీలక రంగాలకు కూడా దానిని మూలస్తంభంగా మార్చాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. హిందీ ఇతర భారతీయ భాషలకు పోటీ కాదని, వాటన్నిటికీ ఒక నేస్తం మాత్రమేనని ఆయన పునరుద్ఘాటించారు. హిందీ దివస్ సందర్భంగా ఆదివారం అహ్మదాబాద్ లో జరిగిన ఐదవ అఖిల భారత అధికార భాషా సమ్మేళనంలో అమిత్ షా ప్రసంగించారు. అన్ని పనులు భారతీయ భాషల్లో జరిగినప్పుడు, ప్రజలతో మన బంధం దానంతట అదే బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక ప్రత్యేక పిలుపునిచ్చారు. తమ మాతృభాషలోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని, ఆ లేఖలకు తాను కూడా వారి భాషలోనే సమాధానం ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో భారతీయ భాషలకు, సంస్కృతికి పునరుజ్జీవనం లభించిందని షా ప్రశంసించారు. ఐక్యరాజ్యసమితి, జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ హిందీలో మాట్లాడి భారతీయ భాషల గౌరవాన్ని ఇనుమడింపజేశారని గుర్తుచేశారు. బానిసత్వపు చిహ్నాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ప్రధాని మోదీ తీసుకున్న 'పంచ ప్రాణ్' (ఐదు ప్రతిజ్ఞలు)లో భాషలకు కూడా కీలక పాత్ర ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ చెప్పిన మాటలను ఆయన ఉటంకించారు. 'స్వరాజ్, స్వధర్మం, స్వభాష' అనే మూడు అంశాలు దేశ ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నాయన్నారు. పిల్లలకు వారి మాతృభాషలోనే విజ్ఞానాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. వేరే భాషలో నేర్చుకోవడం వల్ల పిల్లల అభ్యాస సామర్థ్యం 30 శాతం వరకు తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. 'భారతీయ భాషా అనుభాగ్' ఏర్పాటుతో అధికార భాషా విభాగం ఇప్పుడు పూర్తిస్థాయి శాఖగా మారిందని ఆయన తెలిపారు. హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్ర న్యాయ రాష్ట్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, పార్లమెంటరీ రాజభాషా కమిటీ ఉపాధ్యక్షులు భర్తృహరి మహతాబ్, స్థానిక ఎంపీ దినేష్ మక్వానా, ప్రఖ్యాత గుజరాతీ విద్యావేత్త ప్రొఫెసర్ విజయ్ పాండ్యా తదితరులు హాజరయ్యారు.

# విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టించిన ఘనుడు రేవంతే..

## సర్కారు మొద్దు నిద్ర నటిస్తుండటం సిగ్గుచేటు

### కమీషన్లు దండుకోవడంపై ఉన్న ధ్యాస, విద్యా కమిషన్ రిపోర్టుపై లేదా?
### కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు కురిపించారు. అతి తక్కువ కాలంలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిన విద్యా శాఖ మంత్రి, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడని విమర్శించారు. రెండేళ్లుగా రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలు మొత్తుకుంటున్నా రేవంత్ సర్కారు మొద్దు నిద్ర నటిస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందన్నారు. సెమిస్టర్ పరీక్షలు కూడా వాయిదా వేసే పరిస్థితి వస్తుంటే విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. సోమవారం నుంచి నిరసనలు, నిరాహార దీక్షలు, నిరవధిక బంద్‌లు చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ ఎందుకు నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లరి చేయొద్దు అని ఆర్థిక మంత్రి సుద్దులు చెప్పినంత మాత్రాన యాజమాన్యాలు, విద్యార్థుల గోడు తీరదని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి కమీషన్లు దండుకోవడంపై ఉన్న ధ్యాస, విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్టు పై లేదన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాటలు ఏమయ్యాయి రేవంత్ రెడ్డి అని అని హరీశ్ రావు ప్రశ్నించారు. గ్రీన్ చానెల్ లో నిధుల విడుదల అన్న మీ మాటలు నీటి మూటలేనా అని ఎద్దేవా చేశారు.

**విద్యార్థుల చదువు పట్ల నీకు శ్రద్ధ లేదా?..**

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, ఫీజు రీయింబర్స్ ఇవ్వడానికి లేని డబ్బులు ముఖ్యమంత్రి కమిషన్ల ప్రాజెక్టులకు ఎలా వస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు డిఏలు ఇవ్వమంటే 'నన్ను కోసుకొని తిన్న పైసలు లేవు' అని చెప్పిన ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీకి 20వేల కోట్ల టెండర్లు, మూసీలో గోదావరి నీళ్లు పోసేందుకు 7000 కోట్ల టెండర్లు, జీహెచ్ఎంసీలో హై లెవెల్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు నిర్మించేందుకు మరో ఏడు వేల కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నాడన్నారు. కమిషన్లు దండుకునేందుకు రెండున్నర లక్షల కోట్లకు టెండర్లు పిలుస్తున్న రేవంత్ రెడ్డి.. విద్యార్థుల చదువు పట్ల నీకు శ్రద్ధ లేదా? విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పట్ల ఆలోచన లేదా అని ధ్వజమెత్తారు. ఫీజు రియంబర్స్మెంట్ విషయమై బీఆర్ఎస్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తే విడతల వారీగా బకాయిలు విడుదల చేస్తామని, ఏ ఏడాదికి ఆ ఏడాది క్లియర్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం సిగ్గులేకుండా మాట తప్పిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద నోట్ల రద్దు, కరోనా వంటి ఆర్థిక మాంద్యాల్లోనూ ఫీజు రీయింబర్సు మెంటు ఆపలేదు.




తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ గారి పాలనలో 20 వేల కోట్లు ఫీజు రీయింబర్సు మెంటు చెల్లించామన్నారు. ఒకవైపు ఫీజు రీయింబర్స్మెంట్ రాక, మరోవైపు ఫీజు బకాయిలు పేరుకు పోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# నిరసనలతో దద్దరిల్లిన లండన్

## లక్షమందితో యాంటీ ఇమిగ్రేషన్ ర్యాలీ.. బ్రిటన్‌లో వలసదారులకు కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల కాలంలో బ్రిటన్‌కు అక్రమ వలసలు భారీ ఎత్తున పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 28,000 మందికి పైగా వలసదారులు పడవల ద్వారా బ్రిటన్ చేరుకున్నట్లు నివేదికలు చెబున్నాయి. బ్రిటన్‌కు వచ్చే వారిలో చాలామంది ఆశ్రయం కోరుతూ వస్తున్నారు. వలసలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో స్థానిక జనాభాలో అసంతృప్తి పెరిగింది. ప్రభుత్వం వలసదారులను తాత్కాలికంగా హోటళ్లలో ఉంచుతోంది. ఈ క్రమంలో ఈ హోటళ్ల వెలుపల గత కొన్ని నెలలుగా స్థానికుల నిరసనలు తెలుపుతున్నారు. వలసదారులు దేశ వనరులను వాడేస్తున్నారని, స్థానికుల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టాల్లో ఉండగా, అక్రమ వలసదారులు దేశానికి భారంగా మారారని యాంటీ ఇమిగ్రేషన్ నిరసనకారులు చెబుతున్నారు. వలసల వల్ల తమ జాతీయ గుర్తింపు, సాంస్కృతిక విలువలు ప్రమాదంలో పడుతున్నాయని భావిస్తున్నారు. యాంటీ ఇమిగ్రేషన్ ఉద్యమానికి టామీ రాబిన్‌సన్ వంటి రైట్ వింగ్ కార్యకర్తలు నాయకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉండగా, వలస సమస్య బ్రిటన్ రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారింది. రిఫార్మ్ యూకే వంటి పార్టీలకు ఇది కీలక అజెండాగా మారింది. రాబిన్‌సన్ లాంటి నేతలు ఈ అంశాన్ని మరింతగా ప్రోత్సహిస్తూ



ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

**అమెరికా, ఇజ్రాయెల్ జెండాలు**

టామీ రాబిన్‌సన్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. యూకే ప్రభుత్వంలోని అనివీతిని తాను బయటపెడుతున్నట్లు టామీ పదే పదే చెబుతుంటారు. అతనికి అమెరికా బిలియనీర్లు, ముఖ్యంగా ఎలాన్ మస్క్ వంటి ప్రముఖుల మద్దతు ఉందని ప్రచారంలో ఉంది. టామీ నిర్వహించిన యాంటీ ఇమిగ్రేషన్ ర్యాలీకి ఎలాన్ మస్క్ వీడియో ద్వారా మద్దతు తెలపడం ఈ ప్రచారానికి మరింత బలాన్ని చేకూర్చింది. బ్రిటన్‌లో ప్రజలు స్వేచ్ఛా హక్కులు వినియోగించడానికి భయపడుతున్నారు మస్క్ ఆ వీడియోలో వ్యాఖ్యానించినట్లు అంతర్జాతీయ మీడియా రాసుకొచ్చింది. యాంటి ఇమిగ్రేషన్ ర్యాలీలో నిరసనకారులు యూనియన్ ఫ్లాగ్, సెంట్ జార్జ్ క్రాస్ జెండాలను ప్రదర్శించారు. కొందరు అమెరికా, ఇజ్రాయెల్ జెండాలు కూడా పట్టుకున్నారు. ప్రధాని కియర్‌ను విమర్శలు చేస్తూ నినాదాలు చేశారు. 'సెండ్ దెం హోమ్' అంటూ వలస వ్యతిరేక నినాదాలు వినిపించాయి. కొంతమంది మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అని ఉన్న టోపీలు ధరించారు.



# మిరాయ్.. రయ్.. రయ్

## ఇండస్ట్రీ రికార్డు

## 2 రోజుల్లో రూ.55 కోట్లు

**మహా:** బాక్సాఫీస్ వద్ద తేజ సజ్జా హీరోగా నటించిన మిరాయ్ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. మిడ్ రేంజ్ సినిమాలు, టైర్ 2 హీరోల విషయంలో రెండో రోజు ఇండస్ట్రీ ఆల్ టైమ్ రికార్డ్‌ని మిరాయ్ బద్దలు కొట్టింది. తెలుగు రాష్ట్రాల వసూళ్లలో రూ.8.20 కోట్ల షేర్‌తో ఇండస్ట్రీ రికార్డ్ సృష్టించాడు. టైర్ 2 హీరోలుగా ఉన్న నాని హిట్ 3, శ్యామ్ సింగరాయ్, దసరా.. విజయ్ దేవరకొండ ఖుషి, కింగ్‌డమ్, గీత గోవిందం.. నాగ చైతన్య తండేల్, లవ్ స్టోరీ, మజిలీ లాంటి సినిమాల రికార్డులని ఈ చిత్రం దాటేసింది. రెండో రోజు తెలుగు రాష్ట్రాల్లో మీడియం రేంజ్ సినిమాలలో హయెస్ట్ షేర్ వచ్చిన సినిమాగానూ టాలీవుడ్ చరిత్రలోనే మిరాయ్ ఘనత సాధించింది. ఈ సినిమాలో తేజ నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ దెబ్బతో టైర్ 2 హీరోలలో తేజ సజ్జా.. పైపైకి వచ్చినట్లుగానే ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేసిన ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ మీద టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. రెండు రోజుల్లో ఓవరాల్‌గా రూ.55 కోట్ల మేర గ్రాస్ వసూళ్లు సాధించినట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.



# జూబ్లీహిల్స్‌లో గెలుపు మనదే

## ఈ ఎన్నికను ప్రతి ఒక్కరూ ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి

### అభ్యర్థి సంగతి ఏఐసీసీ చూసుకుంటుంది

### జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

### హాజరైన మహేష్‌గౌడ్, మంత్రులు, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెలాఖరులో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి పనులు , అభ్యర్థి ఎంపిక పై మంత్రులతో సీఎం చర్చించారు. జూబ్లీహిల్స్ రేసులో నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, అంజన్ కుమార్ యాదవ్‌లు పోటీలు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి. పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలి. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుంది. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది పార్టీ గెలుపు కోసం పనిచేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉంది. మీ పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటా. జూబ్లీహిల్స్ లో పార్టీ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి' అని పేర్కొన్నారు.

# 26 మంది ప్రాణాల కంటే డబ్బే ముఖ్యమా?

## ఎంఐఎం అధినేత ఓవైసీ ఫైర్



**మహా:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడడాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలు విపక్ష పార్టీలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. దేశ భద్రత, పౌరుల ప్రాణాల కంటే ప్రభుత్వానికి డబ్బే ముఖ్యమా? అని నేరుగా ప్రశ్నిస్తున్నాయి. ఈ అంశంపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "పహల్గామ్‌లో మన 26 మంది పౌరులను మతం అడిగి మరీ కాల్చి చంపిన పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడవద్దని చెప్పే దమ్ము మీకు లేదా?" అని అసోం, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. ఈ ఒక్క మ్యాచ్ ద్వారా బీసీసీఐకి వచ్చే రూ.2000 కోట్లు, రూ.3000 కోట్లు 26 మంది పౌరుల ప్రాణాల కన్నా ఎక్కువైపోయాయా? అని నిలదీశారు. "రక్తం, నీరు కలిసి పారలేవని, ఉగ్రవాదంచర్చలు ఒకేసారి సాగవని గతంలో ప్రధాని చెప్పిన మాటలను" ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ 26 మంది పౌరుల కుటుంబాలకు తాము నిన్న, నేడు, రేపు కూడా అండగా నిలుస్తామని ఒవైసీ స్పష్టం చేశారు.



# నేను శివభక్తుణ్ని

## ఆ విషాన్ని నేను హరించేస్తా

### అసోంలో ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

**మహా :** 'నేను శివభక్తుణ్ని.. కాంగ్రెస్ విమర్శల విషాన్ని హరించేస్తా'అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ అసోంలో దరంగ్ జిల్లాలో ఆదివారం వేలకోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. 'నేను ఇలా మాట్లాడితే మోదీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శలు చేస్తుంది. నన్ను ఎంత దూషించినా పట్టించుకోను. ఎందుకంటే నేను శివుని భక్తుడిని.. విమర్శల విషాన్ని హరించేస్తా. కానీ దేశ ప్రజలపై దాడి చేస్తే మాత్రం మౌనంగా ఉండను. ప్రజలే నా దేవుళ్లు. నా బాధను వాళ్ల ముందు వ్యక్తం చేయకపోతే .. ఎవరి ముందు చేస్తాను. అందుకే వాళ్లే నా యజమానులు, నా దేవతలు, నా రిమోట్ కంట్రోల్. నాకు వేరే రిమోట్ కంట్రోల్ లేదు' అని స్పష్టం చేశారు.

# బైక్‌పై సీతక్క పర్యటన



**ములుగు, మహా :** మేడారం మహా జాతర ఏర్పాట్లను పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ములుగు ఎస్పీ శబరిష్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క మేడారం పరిసర ప్రాంతాల్లో బైక్ పై పర్యటించి రహదారుల పరిస్థితిని పరిశీలించారు. జాతర సమయంలో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ట్రాఫిక్ జామ్‌లు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించేందుకు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన ప్రత్యేక మార్గాలపై పోలీసు అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రముఖుల రాకపోకల వల్ల భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జాతర ప్రాంతంలో వాహనాల కదలిక, పార్కింగ్ సదుపాయాలు, అత్యవసర వాహనాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా సమగ్ర ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అయితే హోదాను పక్కనపెట్టి మంత్రి సీతక్క ఎస్పీ బైక్ ప్రయాణించి మహా జాతర ఏర్పాట్లను పరిశీలించడంతో స్థానికులు జై సీతక్క అంటూ నినాదాలు చేశారు.

# నేటి నుంచి తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు బంద్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో సోమవారం నుంచి ఉన్నత విద్యాసంస్థలను బంద్ చేస్తున్నట్లు రాష్ట్ర హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్ అసోసియేషన్ వెల్లడించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. సోమవారం నుంచి విద్యార్థులు ఎవరూ కాలేజీలకు రావొద్దని పిలుపునిచ్చింది. డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, నర్సింగ్ సహా అన్ని కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చింది. టెన్త్ తర్వాత ఉన్న అన్ని కళాశాలల విద్యార్థుల తరగతులకు రావొద్దని పేర్కొంది. అదే సమయంలో సోమవారం నుంచి జరగాల్సిన పరీక్షలను సైతం నిలిపివేస్తున్నట్లు తెలిపింది. దీనిలో భాగంగా పరీక్షలను వాయిదా వేయాలని వర్సిటీలను కోరినట్లు తెలిపింది. విద్యార్థులు కళాశాలకు రావొద్దని, వాటికి తాళాలు వేస్తున్నట్లు స్పష్టం చేసింది.

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.
గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
అడ్మిషన్లు ప్రారంభమైనవి
అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 12
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 22
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
HURRY UP! త్వరపడండి...
FOR ADMISSIONS CONTACT: +91 74369 39999
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO : APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919



## క్లాసికల్ డ్యాన్సర్‌గా...

'స్త్రీ 2' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ నటించనున్న సినిమాపై అతి త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. విక్కీ కౌశల్‌తో 'ఛావా' వంటి బ్లాక్ బస్టర్ సినిమా తీసిన లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించనున్న తాజా చిత్రంలో శ్రద్ధా కపూర్ నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఫీమేల్ ఓరియంటెడ్ సినిమా పనులు ఆల్రెడీ ప్రారంభమయ్యాయని, ఈ చిత్రంలో క్లాసికల్ డ్యాన్సర్ పాత్రలో శ్రద్ధా కపూర్ నటించనున్నారని టాక్. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారట దర్శకుడు లక్ష్మణ్. మరోవైపు ఈ సినిమా కోసం ప్రస్తుతం శ్రద్ధగా క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకునే పనిలో ఉన్నారట శ్రద్ధా కపూర్. మహారాష్ట్ర చరిత్ర, సంస్కృతిని చాటి చెప్పేలా ఈ సినిమా కథనం ఉంటుందని సమాచారం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది చివర్లో విడుదల చేయాలని ఈ చిత్రనిర్మాత దినేష్ విజన్ ప్లాన్ చేస్తున్నారని భోగట్టా. ప్రీప్రొడక్షన్ పనులు పూర్తయిన తర్వాత ఈ సినిమాను అధికారికంగా ప్రకటించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.

## కిస్ మీ ఇడియట్ అంటోన్న శ్రీలీల..
## ఆరేళ్ల తర్వాత రీమేక్!

వైరల్ వయ్యారి శ్రీలీల త్వరలో శివకార్తికేయన్‌కు జంటగా పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. దీనికంటే ముందు 'కిస్ మీ ఇడియట్' అనే చిత్రంతో తమిళ ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అవుతోంది. ఇది ఆమె కన్నడంలో నటించిన రెండవ చిత్రం కిస్‌కు రీమేక్ కావడం గమనార్హం. కన్నడలో కిస్ మూవీ 2019లో విడుదలై శతదినోత్సవం జరుపుకుంది. విరాట్ కథానాయకుడిగా నటించిన ఇందులో రోబో శంకర్, నాంజిల్ విజయమన్, అస్వతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు ఏపీ అర్జున్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి జయశంకర్ రామలింగం ఛాయాగ్రహణం, ప్రకాష్ నిక్కి సంగీతాన్ని అందించారు.

**కథేంటంటే?**

మాతృకకు పనిచేసిన డైరెక్టర్ అర్జున్ తమిళ వర్షన్‌కూ పని చేస్తున్నారు. కిస్ మీ ఇడియట్ చిత్రం సెప్టెంబర్ 26వ తేదీన తెరపైకి రానుంది. ఈ చిత్ర వివరాలను దర్శకుడు మీడియాకు వెల్లడించాడు. 'కాలేజీలో చదువుకునే శ్రీలీల తన తోటి విద్యార్థులతో కలిసి ఆట పట్టించినందుకు గాను ప్రిన్సిపల్ ఆమెను తరగతి గది నుంచి ఒక రోజు బహిష్కరిస్తాడె. దీంతో కోపంతో బయటికి వచ్చిన శ్రీలీల కళాశాల వెలుపల ప్రిన్సిపల్ ఫొటో ఉన్న బ్యానర్‌పై రాయి విసురుతుంది. ఆ రాయి అటుగా వస్తున్న విరాట్ కారుపై పడటంతో అద్దం పగులుతుంది.

**తప్పని స్థితిలో..**

దీంతో శ్రీలీలను విరాట్ నష్టపరిహారంగా రూ.4 లక్షలు ఇవ్వమని డిమాండ్ చేస్తాడు. లేకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తాడు. అంత డబ్బు తన వద్ద లేదని శ్రీలీల ప్రాధేయ పడితే ఒక ముద్దు ఇవ్వు లేదా తన వద్ద రెండు నెలలు సహాయకురాలిగా పనిచేయమని చెబుతాడు. దీంతో శ్రీలీల అతని వద్ద రెండు నెలలు సహాయకురాలుగా పనిచేయడానికి అంగీకరిస్తుంది. అలా శ్రీలీల విరాట్‌పై ప్రేమ పెంచుకున్న తరుణంలో గడువు పూర్తి కావడంతో ఆమెను పని నుంచి తొలగిస్తాడు. ఆ తర్వాత ఆమె లేకుండా తాను ఉండలేనన్న భావన విరాట్‌కు కలుగుతుంది అలాంటి వారి ప్రేమ ఫలించిందా ? లేదా అన్న పలు ఆసక్తికరమైన అంశాలతో కిస్ మీ ఇడియట్ రూపొందింది అని దర్శకుడు చెప్పారు.



## చిన్నారితో ఏలియన్ స్నేహం..గిలిగింతలు పెట్టిస్తుంది!

హేయ్ కిడ్స్...జియో స్టార్ లో ఓ సూపర్ మూవీ వచ్చిందోచ్. అదే లిలో & స్టిచ్. ఇదో సైంటిఫిక్ కామెడీ మూవీ. ఎర్త్ కి దూరంగా ఓ ప్లానెట్ లో ఏలియన్స్ ఓ ఎక్సపరిమెంట్ చేస్తుంటారు. దాంట్లో 626 అనే సూపర్ పవర్స్ ఉన్న ఏలియన్‌ను క్రియేట్ చేస్తారు. అయితే యాక్సిడెంటల్ గా ఆ 626 ఏలియన్ ఎర్త్ మీద పడుతుంది. అది కూడా సరిగ్గా లిలో అనే పాప ఇంటి దగ్గర పడుతుంది. ఏలియన్ ప్లానెట్ హెడ్ ఈ 626 ని ఎర్త్ నుండి తీసుకురావడానికి మరో రెండు ఏలియన్స్ ని భూమి మీదకు పంపిస్తారు. అయితే ఈ లోపు పేరెంట్స్ ,ఫ్రెండ్స్ లేని లిలో కి 626 దొరికి మంచి ఫ్రెండ్ అవుతుంది.లిలో దానికి స్టిచ్ అని పేరు పెడుతుంది. లిలో & స్టిచ్ చేసే అల్లరి ఈ సినిమాలో సూపర్ హైలైట్. మరీ ముఖ్యంగా స్టిచ్ చేసే అల్లరి మిమ్మల్ని గిలిగింతలు పెట్టిస్తుంది. స్టిచ్ ని ఎత్తుకెళ్ళడానికి వచ్చిన ఇద్దరు ఏలియన్లు మనుషుల్లా మారి చేసే అల్లరి ఇంకా సూపర్ గా ఉంటుంది. ఇంకో సూపర్ విషయం ఏంటో తెలుసా, ఈ సినిమాని రూ. 10 కోట్లు పెట్టి తీస్తే వచ్చిన వందల కోట్ల లాభాలు వచ్చాయి. సో కిడ్స్.. హావ్ ఎ నైస్ జర్నీ విత్ లిలో & స్టిచ్ ఆన్ జియో స్టార్.



# క్రీడా వార్తలు | SPORTS NEWS

# భారత్ ఘనవిజయం
## దుబాయ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ చిత్తు
### భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేసిన పాక్
### సింపుల్ గా విజయతీరాలకు చేర్చిన సూర్య, తిలక్

**మహా, స్పోర్ట్స్ డెస్క్:** వరల్డ్ కప్‌లోనే కాదు ఆసియా కప్‌లోనూ తమకు తిరుగులేదని చాటుతూ పాకిస్థాన్‌ను చిత్తు చేసింది భారత జట్టు. ఆదివారం చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించిన టీమిండియా ఈ మెగా టోర్నీలో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. దుబాయ్ స్టేడియంలో కుల్దీప్ యాదవ్ విజృంభణలో 127కే పాక్ పరిమితం అవ్వగా.. ఛేదనలో అభిషేక్ శర్మ (31) బౌండరీల మోతతో మెరుపు ఆరంభం ఇచ్చాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(47 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మూడో వికెట్‌కు తిలక్ వర్మ(31)తో కలిసి 56 రన్స్ జోడించిన సూర్య జట్టు విజయానికి బాటలు వేశాడు. ఫినిషర్ శివం దూబే(10 నాటౌట్) తనదైన స్టయిల్లో ఆడగా.. సిక్సర్‌తో భారత్‌కు 7 వికెట్ల విజయాన్ని అందించాడు సూర్య. ఆసియా కప్‌లో బాయ్‌కాట్ నిరసనల మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్ విజయఢంకా మోగించింది. చిరకాల ప్రత్యర్థి పాక్‌ను వణికిస్తూ భారీ విక్టరీతో ఈజీ కాదని మరోసారి చాటింది. తొలుత పాక్‌ను 127కే నిలువరించిన నిర్దేశించిన టీమిండియా స్వల్ప లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే అందుకుంది. దాయాది నిర్దేశించిన ఛేదనను భారత్ ధాటిగా మొదలెట్టింది. షాహీన్ అఫ్రిది వేసిన తొలి ఓవర్లో మొదటి రెండు బంతులకు అభిషేక్ శర్మ 4, 6 బాదాడు. రెండో ఓవర్లో సయీం అయూబ్‌ను ఉతికేస్తే శుభ్‌మన్ గిల్ (10) రెండు ఫోర్లు కొట్టాడు. అయితే.. ఆఖరి బంతికి షాట్ ఆడబోయిన గిల్ స్టంపౌట్ అయ్యాడు. వికెట్ పడినా సరే అభిషేక్ జోరు తగ్గించలేదు. సయీంను లక్ష్యంగా చేసుకొని రెండు బౌండరీలు సాధించిన అతడు అతడి ఓవర్లోనే వెనుదిరిగాడు. అభిషేక్ ఔటయ్యాక వచ్చిన తిలక్ వర్మ(31) సైతం ఫోర్లతో చెలరేగాడు. నవాజ్ వేసిన ఆరో ఓవర్లో రెండు ఫోర్లతో జట్టు స్కోర్ 60 దాటించాడు. దాంతో.. పవర్ ప్లేలో భారత్ రెండు వికెట్ల నష్టానికి 61 స్కోర్ చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(47 నాటౌట్), తిలక్ . మూడో వికెట్‌కు విలువైన 56 రన్స్ జోడించి జట్టును విజయ తీరాలకు చేర్చారు. అయితే.. అయుబ్ ఓవర్లో తిలక్ బౌల్డ్ కాగా.. అప్పటికి విజయానికి 45 బంతుల్లో 31 రన్స్ కావాలి. అనంతరం శివం దూబే(10 నాటౌట్) అండగా సూర్య చెలరేగిపోయాడు. సయీం వేసిన 15వ ఓవర్లో చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపాడు. సూఫియన్ బౌలింగ్‌లో ఎల్బీ అప్పీల్ అనంతరం సారథి సూర్య సిక్సర్ బాదగా 7 వికెట్ల తేడాతో పాక్‌ను మట్టికరిపించింది భారత్. ఈ విక్టరీతో సూర్యకుమార్ యాదవ్ బృందం సూపర్ 4కు చేరువైంది.



## ఫర్హాన్, అఫ్రిది రాణించగా..

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న పాకిస్థాన్ భారత బౌలర్ల విజృంభణతో స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా వికెట్ల వేటతో పాక్‌ను మానసికంగా దెబ్బతీశారు. యూఏఈపై చెలరేగిన కుల్దీప్ యాదవ్(3-18) మరోసారి తన స్పిన్ మ్యాజిక్‌తో మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బకొట్టగా.. అక్షర్ పటేల్(2-18) ఓ చేయి వేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(41) ఒంటరి పోరాటం చేశాడు. ఆఖర్లో షాహీన్ అఫ్రిది(33 నాటౌట్) నాలుగు సిక్సర్లతో రెచ్చిపోయాడు. దాంతో పాక్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 రన్స్ చేసింది.

## ఆంధ్ర బ్యాటింగ్ కోచ్‌గా ముంబై దిగ్గజం..



దేశవాళీ క్రికెట్‌లో రంజీ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న ఆంధ్ర క్రికెట్ సంఘం కీలక నియామకాలతో కోచింగ్ బృందాన్ని పటిష్టం చేసుకుంది. ప్రధాన కోచ్‌గా న్యూజిలాండ్‌కు చెందిన గ్యారీ స్టీడ్ ను ఎంచుకున్న ఏసీఏ.. బ్యాటింగ్ కోచ్‌ను ఖరారు చేసింది. ఆదివారం ముంబై దిగ్గజం వినీత్ ఇదుక్కర్) ను బ్యాటింగ్ కోచ్‌గానియమిస్తూ ప్రకటన విడుదల చేసింది. ఈ మాజీ ఆటగాడు ఇప్పటికే ఆంధ్ర స్క్వాడ్‌తో కలిశాడు. ప్రస్తుతం కర్నాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మైసూర్‌లో జరుగుతున్న టోర్నమెంట్ తో అతడి కోచింగ్ జర్నీ ప్రారంభం కానుంది. 'దేశవాళీ క్రికెట్‌లో ముంబై ఆధిపత్యం చెలాయించడంలో ఇదుక్కర్ పాత్ర ఎనలేనిది. సహాయక సిబ్బందిగా ఆయన అందించిన సేవలు అపూర్వం. నిరుడు ఆయన బ్యాటింగ్ సూచనలతో ముంబై జట్టు రంజీ సెమీఫైనల్ చేరింది. అనంతరం జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలుపొందింది. అందుకే.. అనుభవజ్ఞుడైన అతడి సేవలు ఆంధ్ర జట్టుకు ఉపయోగపడుతాయని నమ్ముతున్నాం' అని ఏసీఏ వెల్లడించింది. ఆంధ్ర జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా ఎంపికఫస్ట్ క్లాస్ కెరీర్లో 43 మ్యాచ్‌లువ్వడం పట్ల ఇదుక్కర్ సంతోషం వ్యక్తం చేశాడు. ఏసీఏతో చర్చలు, ఒప్పందం పూర్తయ్యాక మీడియాతో మాట్లాడుతానని చెప్పిన ఇదుక్కర్.. మైసూర్ బయల్దేరుతున్నాను అని క్రిక్‌బజ్‌తో తెలిపాడు. రంజీ ఛాంపియన్ ముంబైకి ఇదుక్కర్ కొన్నాళ్లుగా కోచింగ్ ఇస్తున్నాడు. అయితే.. 202526 సీజన్ ముందు అతడితో కాంట్రాక్ట్ రద్దు చేసుకుంది ముంబై క్రికెట్ సంఘం. దాంతో.. ఇదుక్కర్ సేవల్ని వినియోగించుకోవాలని ఆంధ్ర క్రికెట్ సంఘం రంగంలోకి దిగింది. ఈ మాజీ క్రికెటర్ 16 ఏళ్ల ఫస్ట్ క్లాస్ కెరీర్లో 43 మ్యాచ్‌లు ఆడాడు.

## బీసీసీఐ పదవిపై అనాసక్తి..
### బెంగాల్ క్రికెట్ బాస్‌గా గంగూలీ..!

భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ మరోసారి సొంత రాష్ట్రంలో క్రికెట్ బాస్‌గా సేవలందించనున్నాడు. గతంలోనే తన ముద్ర వేసిన ఈ వెటరన్ రెండోసారి బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్ష పీఠాన్ని అధిరోహించనున్నాడు. తన పెద్ద సోదరుడు స్నేహశిష్ గంగూలీ తదనంతరం బాధ్యతలు చేపట్టనున్నాడు. దాంతో మరోసారి బెంగాల్ క్రికెట్ గంగూలీ కుటుంబం చేతుల్లోకి రానుంది. బెంగాల్ క్రికెట్ సంఘం వార్షిక సమావేశం సెప్టెంబర్ 22న జరుగనుంది. అదే రోజున కొత్త కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. కాబట్టి.. సెప్టెంబర్ 14 ఆదివారం అధ్యక్ష పదవి కోసం గంగూలీ నామినేషన్ వేశాడు. అయితే.. అతడికి పోటీగా ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవంగా క్యాబ్ ప్రెసిడెంట్ గా దాదా ఎంపికవ్వడం ఖాయం. 2019 నుంచి గంగూలీ సోదరుడు స్నేహశిష్ క్యాబ్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. 'మరోసారి బీసీసీఐ అధ్యక్ష పదవి చేపడుతారా?' అనే ప్రశ్నకు దాదా మీరు



అనవసరంగా ఏవేవో ఊహించుకోండి అని బదులిచ్చాడు. దాంతో.. అతడు బీసీసీఐ బోర్డులో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.2015 నుంచి 2019 వరకూ బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేసిన గంగూలీ.. మరోదఫా ఆ పదవి చేపట్టేందుకు సిద్ధంగా లేడు. ఇప్పటికే ఎస్‌ఏ20లో ప్రిటోరియా క్యాపిటల్స్ కోచ్‌గా అతడుఎంపికైన విషయం తెలిసిందే. క్యాబ్ కొత్త కార్యవర్గం కూడా ఏకగ్రీవంగా ఎన్నిక కానుంది. నితీశ్ రంజన్ దత్తా (ఉపాధ్యక్షుడు), బాబ్లు కొలే(కార్యదర్శి), మదన్ మోహన్ ఘోష్(సంయుక్త కార్యదర్శి), సంజయ్ దాస్ (కోశాధికారి)గా నామినేషన్ వేశారు. ఈ నలుగురు తప్ప ఇంకొకరు పోటీలో లేకపోవడంతో వీరంతా ఎన్నికైనట్టే.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034